క్లుప్తంగా

9నుంచి శివరాత్రి బ్రహ్మోత్సవాలు

రాజంపేట టౌన్ : పట్టణంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఈ నెల 9న శివరాత్రి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేయనున్నట్లు ఆలయ చైర్మన్ లక్ష్మీప్రసన్నాచారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 18వ తేదీ శివరాత్రి పర్వదినం వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయన్నారు. వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవిందమాంబల ఉత్సవమూర్తులకు విశేష పూజలు, అభిషేకాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. శివరాత్రి పర్వదినాన ఉదయం పది గంటలకు గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం అన్నప్రసాదం, సాయంత్రం గ్రామోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

బాధ్యతల స్వీకరణ

సంబేపల్లె : మండల వ్యవసాయశాఖాధికారిగా ఎ.రామాంజులరెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇక్కడ ఇన్‌చార్జ్ ఏఓగా పనిచేస్తున్న వెంకటరమణారెడ్డిని భూసార సంరక్షణకు బదిలీ చేసినట్లు తెలిపారు. నిత్యం మండల రైతులకు అందుబాటులో ఉంటూ రైతులకు సేవలందిస్తానని రామాంజులరెడ్డి తెలిపారు.

క్రీడల్లో గెలుపోటములు సమానం


టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎస్‌ఐ

సిద్దవటం: క్రీడా పోటీల్లో గెలుపోటములు సమానంగా క్రీడాకారులు తీసుకోవాలని సిద్దవటం ఎస్‌ఐ తులసీ నాగప్రసాద్ అన్నారు. మండలంలోని మాధవరం- 1 గ్రామ పంచాయతీలోని ఎస్‌కేఆర్ నగర్‌లో సోమవారం ఆయన వాలీబాల్ టోర్నమెంటును ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర గృహనిర్మాణాల శాఖ డైరెక్టర్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, సిద్దవటం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ముమ్మడి శ్రీధర్ రెడ్డి, మాజీ సర్పంచ్ మేకపాటి సుబ్బారెడ్డిలు హాజరయ్యారు.

దుద్యాలలో ఉచిత వైద్య శిబిరం

సంబేపల్లె : మండల కేంద్రంలోని సచివాలయం సమీపంలో సోమవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్క్‌స్కీమ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 87 మందికి సంబేపల్లె వైద్యాధికారి సూర్యనారాయణరెడ్డి వైద్యపరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. అనంతరం ఎయిడ్స్, టీబీ వ్యాధుల నియంత్రణపై వివరించారు. అలాగే గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ ఫండ్ సంస్థ సిబ్బంది, సంబేపల్లె పీహెచ్‌సీ వైద్యసిబ్బంది, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా గొబ్బెమ్మతల్లి నిమజ్జనం


నిమజ్జనంలో పాల్గొన్న మహిళలు

రాజంపేట రూరల్ : మండల పరిధిలోని హస్తవరం గ్రామంలో సోమవారం వేడుకగా గొబ్బెమ్మతల్లి నిమజ్జన వేడుకను భక్త శ్రద్ధలతో గ్రామస్తులు నిర్వహించారు. ఆదివారం రాత్రి గొబ్బెమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలు, యువతులు పాడిన పాటలు ఆకట్టుకున్నాయి. నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు.

వైభవంగా అంజన్న విగ్రహ ప్రతిష్ట

రామాపురం : మండలంలోని సరస్వతిపల్లె గ్రామం దళితవాడ సమీపంలో సోమవారం అంజన్న విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సరస్వతిపల్లె గ్రామ ప్రజలే కాక చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు తండోపతండాలుగా వచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాల వితరణతోపాటు అన్నదానం నిర్వహించారు.

పరామర్శ

చిన్నమండెం : మండల పరిధిలోని చిన్నర్సుపల్లె సర్పంచ్ దేవరింటి పుల్లమ్మ సిద్ధయ్యల కుమారుడు దేవరింటి గిరిబాబు అనారోగ్యంతో చికిత్స పొందుతూ బెంగళూరు ఆసుపత్రిలో మృతిచెందాడు. సోమవారం గిరిబాబు మృతదేహానికి జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ దేవనాథరెడ్డి నివాళులర్పించి, కుటుంబసభ్యులను పరామర్శించారు.

అర్జీదారులకు అన్నదానం

రాయచోటి టౌన్ : స్పందన కార్యక్రమంలో పాల్గొన్న అర్జీదారులకు ఉచితంగా భోజనం అందించారు. రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో దాతల సహకారంతో గత ఎనిమిది వారాలుగా అన్నదానాన్ని కల్పిస్తున్నారు. సోమవారం ఏర్పాటు చేసిన అన్నదానానికి రామాపురం మండలం స్టోన్ క్రషర్స్ యజమానుల సహకారించారు.

సంక్షేమ సారథిని ఆశీర్వదించండి

- ఓట్ల కోసం మీ కష్టాలను తెలుసుకొని.. పరిష్కరించేందుకే
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి
- ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నారు– జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి


రాజంపేట: పాటూరు గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే, జెడ్పీచైర్మన్, ఎంపీపీ


పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడా

రాజంపేట : ఐదేళ్లకొకసారి ఓట్ల కోసం కనిపించే ఎమ్మెల్యేని కాదని, తాను ఓట్ల కోసం రాలేదని, మీ కష్టాలు, సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకు తనవంతు బాధ్యతగా వచ్చానని సోమవారం నిర్వహించిన గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల వద్ద రాజంపేట శాసనసభ్యుడు మేడా మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. సోమవారం పాటూరు గ్రామంలో గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే గడపగడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు ప్రతి ఒక్కరికి అందాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 98శాతం మేరకు అమలు చేశారన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసి సంక్షేమ సారథిగా నిలిచారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత అందరికి సంక్షేమ ఫలాలు అందేలా తీసుకొచ్చిన కార్యక్రమాలకు విశేష స్పందన లభిస్తోందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి ఎమ్మెల్యేతోపాటు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్పయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు పరిచే విధంగా పాలన కొనసాగిస్తున్నారన్నారు. అన్ని వర్గాలకు మేలు జరిగే విధంగా జగనన్న పాలన కొనసాగుతోందన్నారు. ముఖ్యమంత్రికి ప్రజల ఆశీర్వాదాలు ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి, సర్పంచి స్వరూపామోహన్‌రెడ్డి, ఎంపీపీ రమేష్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు గాలా సుధాకర్‌రెడ్డి, ఖాదర్‌బాషా, నాయకులు తోట శ్రీనువాసులు, జెడ్పీటీసీ గడికోట ఉషాసుబ్బారెడ్డి, పార్టీ కన్వీనర్ గోపిరెడ్డి, జిల్లా వక్ఫ్ బోర్డు ప్రధాన కార్యదర్శి సయ్యద్‌అమీర్, మండల కో–ఆప్షన్ సభ్యుడు కలీం, ఎంపీడీఓ సౌభాగ్య, తహసీల్దారు ఉదయశంకర్‌రాజు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీల కాలనీలో..

పాటూరు బీసీ, ఎస్టీ, ఎస్సీ మైనార్టీ కాలనీలో ఎమ్మెల్యే మేడా పర్యటించారు. గడప గడప కార్యక్రమంలో భాగంగా బీసీ వర్గాలతో మమేకమయ్యారు. వారికి ప్రభుత్వం నుంచి రావాల్సిన సంక్షేమం ఏ మేరకు అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. సమస్యలు తెలుసుకున్నారు. అలాగే వారి నుంచి వినతులు స్వీకరించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం చేయరాదని వారి ఎదుట హెచ్చరించారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు

సిద్దవటం : మండలంలోని శివునిపల్లె గ్రామ సమీపంలో వెలసిన కాశిరెడ్డినాయన స్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం వృషభ రాజములచే బండలాగుడు పోటీలు రసవత్తరంగా సాగాయి. ఈ పోటీల్లో మొత్తం 5 జతల ఎండ్లు పాల్గొన్నాయి. బండలాగుడు పోటీలను రాజంపేట ఎమ్మెల్యే మేడా ప్రారంభించారు. మొదటి బహుమతి కాశినాయన మండలం అనవారిపల్లెకి చెందిన శీలం జగన్‌మోహన్‌రెడ్డి ఎద్దు, రెండో బహుమతి నందలూరు మండలం షేక్ హబీబుల్లా ఎద్దు, మూడవ బహుమతి ప్రకాశం జిల్లా బెస్తవారిపేట జేసీ అగ్రహారానికి చెందిన లక్కు నాగశివశంకర్ ఎద్దు గెలుచుకున్నాయి. నగదు బహుమతులను ఎమ్మెల్యే మేడా అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఉపాసి శ్రీకాంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కె.వి. సుబ్బయ్య, ఉపాసి వెంకటరమణారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు, ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలను పరిష్కరించండి


దివ్యాంగులతో మాట్లాడుతున్న అజయ్ రెడ్డి

పెనగలూరు : రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి అన్నారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అనేక మంది రైతులను సమావేశానికి పిలిపించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ పరిధిలోని ప్రధాన సమస్యలపై రైతులను తిప్పుకోకుండా వెంటనే పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులకు సంబంధించిన అంశాలపై ఆయన చర్చించారు. సర్వేలో రైతులకు ఏవైనా సమస్యలు వస్తే సానుకూలంగా పరిష్కరించేందుకు రెవెన్యూ సిబ్బంది కృషి చేయాలన్నారు.

దివ్యాంగులకు ఇంటిపట్టాలు..

దివ్యాంగులకు ఇంటి పట్టాలను ఇచ్చేందుకు కృషి చేస్తామని కొండూరు అజయ్ రెడ్డి తెలిపారు. అజయ్ రెడ్డిని కలిసేందుకు దివ్యాంగులు రెవెన్యూ కార్యాలయానికి వచ్చారు. వారి సమస్యలు తెలుసుకొని తహసీల్దార్‌తో చర్చించారు. గ్రామాల్లో ప్రభుత్వ స్థలం ఉంటే వారికి పట్టాలు ఇచ్చేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల వైస్ ప్రెసిడెంటు కొండూరు విజయ్ రెడ్డి, తహసీల్దార్ శ్రీధర్ రావు, ఆర్ఐ చంద్రమోహన్ రెడ్డి, సర్వేయర్ ఓబయ్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కనుల పండువగా వేంకటేశ్వరుడి కల్యాణం


రాజంపేట రూరల్: కల్యాణంలో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి, మున్సిపల్ చైర్మన్ పోలా

రాజంపేట రూరల్ : శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మి వేంకటేశ్వరస్వామి వారి కల్యాణం ఆలయ అధ్యక్షుడు కె.చలపతి ఆధ్వర్యంలో కనుల పండువగా నిర్వహించారు. పట్టణంలోని రామ్‌నగర్‌లో ఉన్న తిరుమలగిరిలో జరిగిన ఈ వేడుకలో జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డిలు పాల్గొన్నారు. ఉత్సవ విగ్రహాలకు వేదపండితులు, సంకల్పదీక్షుడు రాజేంద్రం నాగేశ్వరరావు బృందం శాస్త్రోక్తంగా వేద మంత్రాలు వల్లిస్తూ కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. తదనంతరం వైభవంగా గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

ముగిసిన కాశిరెడ్డినాయన ఆరాధన ఉత్సవాలు

సిద్దవటం : మండలంలోని శివునిపల్లె వద్ద ఉన్న కాశిరెడ్డినాయన స్వామి ఆలయంలో ఆరాధన ఉత్సవాలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ ఆకేపాటి, వైఎస్‌ఆర్‌సీపీ సిద్దవటం మండల ఇన్‌చార్జి మేడా మధుసూదన్‌రెడ్డిలు విచ్చేసి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహకులు రామసుబ్బారెడ్డి వారికి శాలువా కప్పి పూలమాలతో సన్మానించి తీర్థప్రసాదాలను అందజేశారు.

అంగన్‌వాడీలకు కనీస వేతనాన్ని ప్రకటించాలి


కలెక్టరేట్ ముట్టడిలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు

రాయచోటి అర్బన్ : సుప్రీంకోర్టుతీర్పు ఆధారంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు గ్రాట్యూటీ ఇస్తూ కనీస వేతనం రూ.26 వేలుగా ప్రకటించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వరి, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ చంద్రశేఖర్, ఏ.రామాంజులు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలు పెద్దసంఖ్యలో కలెక్టరేట్‌ను ముట్టడించి, దిగ్బంధనం చేశారు. పెద్దసంఖ్యలో కలెక్టరేట్‌లోకి చొచ్చుకు వెళ్ళేందుకు అంగన్‌వాడీలు చేసిన ప్రయత్నాలను పోలీసులు అడ్డుకున్నారు. స్వల్ప తోపులాట చోట చేసుకోంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిన ఫేస్‌యాప్‌ను వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేశారు. సహాయకులకు ప్రమోషన్లు కల్పించే అంశంలో రాజకీయ ప్రమేయాన్ని నివారించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, యూనియన్ అధ్యక్షురాలు శ్రీలక్ష్మి, వర్కింగ్ ప్రెసిడెంట్ భాగ్యలక్ష్మి, నాయకురాళ్ళు బంగారమ్మ, ఖాజాబీ, ఓబులమ్మ, సుకుమారి, ప్రభావతి, సిద్దమ్మ, ముధురవాణి, శ్రీవాణి, గౌరి, కరుణశ్రీ, పద్మశ్రీ, భూకైలేశ్వరి, రమదేవి, విజయమ్మ, ఈశ్వరమ్మలతో పాటు వందల సంఖ్యలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన


సస్యరక్షణపై సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు

పుల్లంపేట : సిగటోక, ఆకుమచ్చ తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పించారు వ్యవసాయ అధికారులు. మండల పరిధిలోని వత్తలూరు ఆర్‌బీకే పరిధిలో సాగుచేస్తున్న అరటి పంటలను సోమవారం ఇన్‌చార్జ్ ఉద్యానాధికారి జి.సురేష్ బాబు, వ్యవసాయ అధికారి కృష్ణ చైతన్యతో కలిసి పరిశీలించారు. రైతులకు సిగటోక, ఆకుమచ్చ తెగుళ్ల నివారణ, మంచి నాణ్యతతో కూడిన పంట దిగుబడులు ద్వారా అధిక రాబడిని సాధించడానికి చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను తెలియజేశారు. రైతులకు అరటిలో సిగటోక తెగులు లక్షణాలు, పండు ఈగ నివారణకు చేపట్టాల్సిన సస్యరక్షణ, సమగ్ర యాజమాన్య పద్ధతులను వివరించారు. అదే విధంగా గెలతొడుగుల (బంచ్ కవర్స్) వాడకం ద్వారా రసం పీల్చే పురుగుల బారి నుంచి కాయలను కాపాడటంతోపాటు మంచి నాణ్యతలో కూడిన పంట దిగుబడుల ద్వారా అధిక రాబడులు పొందవచ్చని తెలియజేశారు.

అర్హులకు మిగులు భూమిని పంచండి

రాయచోటి అర్బన్ : అర్హులైన పేదలందరికి మిగులు భూములను ప్రభుత్వం వెంటనే పంచిపెట్టాలని కెవిపిఎస్, వ్యవసాయకార్మిక సంఘం నేతలు డిమాండ్ చేశారు. సోమవారం మిగులు భూములను పేదలకు పంచిపెట్టాలనే డిమాండ్‌తో ఆయాసంఘాల నేతలు కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నేతలు వెంకటయ్య, పందికాళ్ళ మణిలు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా మిగులు భూములను, ప్రభుత్వ భూములను పేదలకు పంచాలన్నారు. అర్హులైన రైతుల అనుభవంలో ఉన్న ప్రభుత్వభూములను వారికే పట్టాలుగా ఇవ్వాలంటూ కోరారు. కార్యక్రమంలో పెంచలయ్య, ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి సి.రామచంద్ర, ఉపాధ్యక్షుడు నాగబసిరెడ్డి, నేతలు కెవిరమణ, అంజి, సురేంద్ర, చెన్నూరు హరిక్రిష్ణ, ఆది, శివ, వెంకటేశు, నాగేష్, జంగమయ్య పాల్గొన్నారు.

బూటకపు పాదయాత్రను ప్రజలు హర్షించరు

– ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు


సంక్షేమ బావుటాను అందిస్తున్న ప్రభుత్వ విప్ కొరముట్ల, కొల్లం గంగిరెడ్డి, సాయికిషోర్‌రెడ్డి

ఓబులవారిపల్లె : నారా లోకేష్ చేపట్టిన బూటకపు పాదయాత్రను ప్రజలు హర్షించరని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు అభిప్రాయపడ్డారు. సోమవారం మండల పరిధిలోని గాదెల, తల్లెంవారిపల్లె, కొత్తపల్లె, దళితవాడలలో ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు, సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి, ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డిలు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు విలేకరులతో మాట్లాడుతూ నారా లోకేష్ చేపట్టిన పాదయాత్రలో జనం లేక వెలవెలబోతోందని, ఇతర ప్రాంతాల నుంచి కిరాయి మనుషులతో పాదయాత్ర చేస్తున్నారని విమర్శించారు. యువగళం పాదయాత్రను చూసి జనాలు మాకు ఇదేమి ఖర్మ అని తలలు పట్టుకుంటున్నారన్నారు. టీడీపీ కార్యక్రమానికి హాజరైన ప్రజలు సైకిల్ పోవాలి, జగనే రావాలని ప్రసంగిస్తుంటే నారాలోకేష్ బిత్తర చూపులు చూస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రజల గుండెల్లో, మనస్సులో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారన్నారు. చంద్రబాబు నాయుడు పాలనలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా వెన్నుపోటు పొడవడంతో అభివృద్ధి కుంటుపడి సంక్షేమ పథకాలు అందక రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు, రైతులు కష్టపడుతున్న సమయంలో వారి కష్టాలను తెలుసుకునేందుకు అప్పట్లో సీఎం జగన్ ప్రజాసంకల్పయాత్ర చేపట్టారని గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతోపాటు చెప్పనటువంటి హామీలను అమలు చేస్తున్నారన్నారు. ఇటువంటి సమయంలో యువగళం పేరుతో నారా లోకేష్ పాదయాత్ర చేపట్టడం హాస్యాస్పదమన్నారు. స్వార్ధ ప్రయోజనాల కోసం ఇటువంటి పనులు చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ అధ్యక్షులు పంజం సుకుమార్ రెడ్డి, ఎన్నికల పరిశీలకులు పి.సునీల్ కుమార్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి సీడీ నాగేంద్ర, మాజీ సింగల్ విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు కొమ్మూరు భాస్కర్ రెడ్డి, కృష్ణయ్య, మాజీ ఎంపీపీ రామకృష్ణయ్య, జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ సుంకేశుల రఫీ, సర్పంచ్‌లు కర్రతోటి నరసమ్మ, ఎన్‌పీ జయపాల్ రెడ్డి, నరేంద్రరాజు, కర్రతోటి వెంకటమ్మ, ఎంపీటీసీ నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

గృహ సారథులు పార్టీకి పట్టుకొమ్మలు

ఎన్నికలకు ఏడాది సమయం మాత్రమే ఉందని, గృహసారథులు పార్టీకి పట్టుకొమ్మలని, రథసారథులు వలే పనిచేయాలని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ ప్రాంగణంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజలకు ఎన్నికలలో ఇచ్చిన హామీలు కంటే చెప్పని హామీలు కూడా అమలు చేశామన్నారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం అందించిన సామగ్రిని ప్రతి కుటుంబానికి అందించి వివరించాలన్నారు. తెలుగుదేశం పార్టీ హయాంలో జరిగిన కష్టాలు, నష్టాలు ప్రజలకు వివరించి వైఎస్సార్ సిపి అధికారంలోకి వచ్చి ప్రజలు పొందిన ప్రయోజనాలు గురించి క్లుప్తంగా వివరించాలన్నారు. ఎన్నికల పరిశీలకులు పులి సునీల్ కుమార్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికలలో అందరూ కష్టపడి ఇష్టంగా పనిచేసి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. కరోనా కష్టకాలంలో రాష్ట్రంలో వలంటరీ వ్యవస్థతో ఎక్కువ ప్రాణనష్టం జరగకుండా అండగా నిలిచారన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా గెలిస్తే మరో 25 సంవత్సరాలు రాష్ట్రంలో ఏ నాయకుడు వైఎస్ జగన్‌ను ఎదుర్కొలేరని అభిప్రాయపడ్డారు.

బ్యాంక్ రుణాలతో జీవనోపాధి

వీరబల్లి : బ్యాంకు రుణాలతో జీవనోపాధి ఏర్పాటు చేసుకోవచ్చని రాయచోటి ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ సీనియర్ మేనేజర్ నాగేంద్రనాథ్ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో జరిగిన వీఓఏల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలకు అర్హతను బట్టి రూ. 15 లక్షల వరకు రుణాలు ఇస్తున్నామని, రుణాలు ద్వారా డైరీ, కుటీర, చేనేత, పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవడం వలన ఆదాయం పెరుగుతుందన్నారు. పేదల సొమ్ము భద్రతకు బ్యాంక్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బీసీ, ఎస్సీ సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలి

రాయచోటి అర్బన్ : రాష్ట్రంలో రద్దుచేసిన బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాలను ప్రభుత్వం వెంటనే పునరుద్ధరించాలని ఏపీ మహానాడు అధ్యక్షుడు యమల సుదర్శనం డిమాండ్ చేశారు. గతంలో దళిత, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఉండే 27 సంక్షేమ పథకాలను వెంటనే పునరుద్ధరించాలంటూ సోమవారం కలెక్టరేట్ ఎదుట మాలమహానాడు నేతలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకులు ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్ళించడమే కాక ఉన్నటువంటి సంక్షేమ పథకాలను పూర్తిగా రద్దు చేశారన్నారు. పథకాలన్నింటిని వెంటనే పునరుద్ధరించాలంటూ కోరారు. లేనిపక్షంలో ఉద్యమించక తప్పదంటూ ఆయన హెచ్చరించారు. ధర్నాలో మాలమహానాడు రాష్ట్రకార్యదర్శి వీరభద్రయ్య, రాయలసీమ జిల్లాల కార్యదర్శి యమల చంద్రయ్య, జిల్లా అధ్యక్షుడు చింతపర్తి శివయ్య, ప్రధాన కార్యదర్శి గాలిశెట్టి సుధాకర్, ఉపాధ్యక్షుడు గుండా మనోహర్, కార్యదర్శి సుధాకర్, జిల్లా అధికార ప్రతినిధి మల్లెల మోహన్, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణానికి ఇచ్చే లబ్ధిని పెంచండి

రాయచోటి అర్బన్ : రాష్ట్రవ్యాప్తంగా జగనన్న కాలనీల్లో ఇళ్ళ నిర్మాణానికి ప్రభుత్వం చెల్లిస్తున్న రూ.1.80 లక్షల మొత్తాన్ని రూ. 5 లక్షలకు పెంచాలని సీపీఐ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. లబ్ధిదారులకు ఇసుక, సిమెంటు, ఇనుపకడ్డీలను ఉచితంగా అందజేయాలని కోరారు. సీపీఐ రాష్ట్రసమితి పిలుపు మేరకు సోమవారం నేతలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీల నిర్మాణంలో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతోందన్నారు. పేదల భూములను అధికార పార్టీ నేతలు బినామీ పేర్లతో కొనుగోలు చేసి కాలనీలో ఇళ్ళ నిర్మాణం కోసం ప్రభుత్వానికి అధిక ధరలకు అమ్ముకుంటున్నారంటూ ఆరోపించారు. ఇళ్ళనిర్మాణ సామగ్రి ధరలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. తమిళనాడులో ప్రభుత్వం ఇళ్ళకు రూ.4.5లక్షలు, తెలంగాణలో కేంద్రప్రభుత్వం ఇస్తున్న మొత్తానికి అదనంగా రూ.3 లక్షలు కలిపి ఇస్తుంటే రాష్ట్రంలో లబ్ధిదారులకు తక్కువ మొత్తాన్ని ఇస్తుండడం దారుణమన్నారు. అసంపూర్తిగా ఉన్న టిడ్కో గృహాలను వెంటనే పూర్తిచేయించి లబ్ధిదారులకు స్వాధీనం చేయాలంటూ డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 22న విజయవాడలో నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమానికి జగనన్న ఇళ్ళలబ్ధిదారులంతా పెద్దఎత్తున తరలిరావాలంటూ కోరారు.

రైతులు.. ధరల నిర్ణేతలు

- దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా వ్యాపారులకు విక్రయం
- రైతు బజారులో అన్ని ఇంటి సరకుల విక్రయాలకు చర్యలు


వినియోగదారులకు కూరగాయలు, అకు కూరలు అమ్ముతున్న చిరువ్యాపారులు

రాయచోటి టౌన్ : ఆరుగాలం పండించిన పంటకు రైతన్నే ధరల నిర్ణేతగా ఉంటే ఆ అనుభూతి వర్ణణాతీతం. ప్రస్తుతం అలాంటి పరిస్థితే ఇప్పుడు రాయచోటి రైతు బజార్‌లో కనిపిస్తోంది. రైతులు తాము పండించిన కూరగాయలు, ఆకుకూరలు నేరుగా రైతు బజారులోకి తీసుకొచ్చి వారికి నచ్చిన విధంగా ధరలు నిర్ణయించుకొని చిరువ్యాపారులకు అమ్ముతున్నారు. దీంట్లో ఎలాంటి కమీషన్లు లేవు, దళారీలు అసలే లేరు. దీంతో రైతులు సంతోషంగా తాము పండించిన కూరగాయలు చిరువ్యాపారులకు అమ్ముతున్నారు. దీంతో చిరువ్యాపారులు అమ్మే ధరలలో కొంత మేర ధరలు తగ్గించి వినియోగదారులకు విక్రయిస్తున్నారు. సామాన్యులకు కూరగాయల ధరలు అందుబాటులోకి తీసుకరావాలని అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి రైతు బజారు రూ. కోటికి పైగా ఖర్చు చేసి నిర్మించారు. ప్రారంభమైనప్పటికీ అయితే కొన్ని సాంకేతిక కారణాల వలన ఈ రైతు బజారు కొద్ది రోజులు మూసేశారు. అయితే తరువాత ఆయన మరింత చొరవతో దీనిని తిరిగి పునఃప్రారంభించారు. ఇప్పుడు మాత్రం రైతు బజారు వినియోగదారులతో కళకళాడుతోంది. అక్కడ చిరువ్యాపారులు సంతోషంగా వ్యాపారాలు సాగించుకొని వారికి కూలీపాటుగా రూ.500లకు తగ్గకుండా సంపాదించుకొంటున్నారు. అంతే కాకుండా సరసమైన ధరలకే కూరగాయలు లభిస్తున్నాయని వినియోగదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దూరం తగ్గడంతో పాటు తక్కువ ధరలకే నాణ్యమైన కూరగాయలు లభిస్తున్నాయని వినియోగదారులు చెప్పడం విశేషం.

నేరుగా చిరు వ్యాపారులకే..

చేతికొచ్చిన పంటతోపాటు ఇతరా రాష్ట్రాల నుంచి తీసుకొచ్చిన దుంపలను చిరువ్యాపారులకు అమ్ముతున్నాను. తెల్లవారు జాము వారికి ఇచ్చిన తరువాత సాయంత్రం నా డబ్బులు నేను తీసుకొంటున్నాను. దళారీలు లేకపోవడంతో కమీషన్ చెల్లించాల్సిన అవసరం లేదు. దీంతో వినియోదారులకూ లాభసాటిగా కనిపిస్తోంది. రైతు బజార్ ఏర్పాటు చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

– లోకేశ్వరరెడ్డి, కూరగాయల రైతు

తక్కువ ధరకు లభిస్తున్నాయి

రైతు బజారు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పుడు చాలా రకాల కూరగాయలు, ఆకుకూరలు తక్కువ ధరలకే లభిస్తున్నాయి. చాలా సంతోషంగా ఉంది. అన్ని రకాల ఇంటి సరుకులు ఇక్కడే లభించే విధంగా చర్యలు చేపట్టాలి.ఆ బజారులోకి వెళ్లి తెచ్చుకోవడం కొంచం కష్టంగా ఉండేది. ఇప్పుడు మార్కెట్ అందుబాటులో ఉండటం ఎంతో సంతోషంగా ఉంది.

– అంజనమ్మ, వినియోగదారురాలు

ఎమ్మెల్యే చొరవతోనే సాధ్యమైంది

రైతు బజారు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి చొరవతోనే ప్రారంభమైంది. సామాన్యులకు దగ్గరగా, సరసమైన ధరలకే కూరగాయలు లభించాలని, రైతులకు దళారీల బెడద ఉండకూడదని దీనిని ప్రారంభించాం. ఇక్కడ త్వరలో చేపలు, మాంసం, ఇతర ఇంటి సరుకులు అందుబాటులోకి తీసుకొస్తాం. రైతులు తాము పండించిన పంటలను నేరుగా ఇక్కడికి తీసుకొచ్చి అమ్ముకోవచ్చు.

– వందాడి వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు

ముఖ ఆధారిత హాజరు నుంచి మినహాయించండి


సబ్‌కలెక్టర్‌కు విన్నవిస్తున్న వీఆర్‌ఏలు

రాజంపేట: ముఖ ఆధారిత హాజరు నుంచి వీఆర్ ఏలకు మినహాయించాలని సబ్‌కలెక్టర్ అహ్మద్‌ఖాన్‌కు సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేలి రవికుమార్ మాట్లాడుతూ వీఆర్‌ఏలకు చాలమందికి స్మార్ట్‌ఫోన్లు లేవన్నారు. చాలామంది నిర్లక్ష్యరాసులన్నారు. యాప్ వినియోగం తెలియదన్నారు. చాలా గ్రామాల్లో నెట్ వర్క్‌లేదన్నారు. రాజంపేట డివిజన్‌లోని రాజంపేట, నందలూరు, పెనగలూరు, పుల్లంపేట, రైల్వేకోడూరు, చిట్వేలి, ఓబులవారిపల్లె, వీరబల్లి, సుండుపల్లె మండలాలల్లో వీఆర్‌ఏలకు ముఖఆధారిత హాజరు నుంచి విముక్తి కల్పించాలన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఏలు సుధాకర్, వెంకటసుబ్బయ్య, కోటేశ్వరరావు, లక్ష్మీకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి

రాజంపేట రూరల్ : జిల్లాలో పెన్షనర్లకు ఏవైన సమస్యలుంటే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి తెలియజేశారు. ఆకేపాటి ఎస్టేట్‌లో సోమవారం ఏపీ ప్రభుత్వ పెన్షనర్ అసోసియేషన్ డైరీలను ఆయన ఆవిష్కరించారు. అవిష్కరణలో పిల్లి పిచ్చయ్య, కృష్ణయ్య, కేవీఎస్ లక్ష్మి, లక్ష్మినారాయణ, సుబ్బయ్య, ధనంజయ, వెంకటేశ్వరీ, జయరామయ్య, పాపయ్య, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.